క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



మాగనూర్: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన ఆర్‌సీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడపొద్దని, లేనియెడల చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. రాష్ డ్రైవింగ్ చేయొద్దని, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని తెలిపారు.

పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈగా విలోక్

మద్దూరు: పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈగా విలోక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ రాజ్ సబ్ డివిజన్‌లో డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న బాబురావు ఇటీవల పదవి విరమణ పొందడంతో మద్దూరు పీఆర్ఏఈగా విధులు నిర్వహిస్తున్న విలోక్ పదోన్నతిపై డిప్యూటీ ఈఈగా విధుల్లో చేరారు. ప్రస్తుతం మద్దూరు ఇన్‌చార్జి ఏఈగా కూడా కొనసాగుతున్నాడు. డిప్యూటీ ఈఈగా ఉమ్మడి మద్దూరు, కోస్గి మండలాలకు వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



మాగనూర్: తెలంగాణ రాష్ట్రంలోని క్రీడా పాఠశాలలో నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం జూన్ 29న పేటలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలో మండలంలోని ఉజ్జెల్లి, మాగనూర్ ప్రాథమిక పాఠశాలల నుంచి క్రీడాపాఠశాల జాతీయస్థాయి జరిగే పోటీలలో ఈ నెల 11, 12వ తేదీలలో హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో జరిగే ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు సాయిబాబా, స్వప్న, దీప, విశాలక్ష్మి, శ్రీనివాసులు, భవ్యశ్రీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేయించాలి



మాగనూర్: మండల కేంద్రంలో వివిధ గ్రామాల్లోని పత్తి, వరి పంటలను మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు.. వడ్వాట్ గ్రామ ఏఈఓ ధనీష మాట్లాడుతూ.. రైతులు తమ పొలలాల్లో ఏఏ పంటలు వేశారో అడిగి తెలుసుకున్నారు. పంటలకు ఏదైన చీడలు, దోమకాటు వంటి సమస్యలు సంభవించాయని పరిశీలించారు. అనంతరం పంటల వివరాలను నమోదును పరిశీలించారు. రైతులు తప్పకుండా వారు సాగుచేసిన పంటల యొక్క వివరాలను నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతులు ఎమైన సమస్యలు ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మద్దూరు: మండల మాజీ సర్పంచ్ గొడపోళ్ల పార్వతమ్మ (73) అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన పార్వతమ్మ అంత్యక్రియలు కుటుంబ సభ్యులు బుధవారం నిర్వహించారు. ఈ మేరకు.. మాజీ ఎమ్మెల్యే పార్వతమ్మకు పూలమావేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సలీం, జగదీశ్వర్, చంద్రశేఖర్, బుగ్గప్ప, బాల్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిగా బలరాం నాయక్‌ను నియమించాలి

నారాయణపేట: కాంగ్రెస్ అధ్యక్ష పదవి లంబాడి సామాజిక వర్గానికి చెందిన ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను నియమించాలని, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు విజయ్ నాయక్ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకి బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి లంబాడీలు కీలక పాత్ర పోషించారన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు మంత్రి పదవితోపాటు తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మా గిరిజన ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మద్దూర్‌లో సభ్యులను సన్మానిస్తున్న సిబ్బంది



ఊట్కూర్‌లో ఎంపీపీని సన్మానిస్తున్న అధికారులు



దామరగిద్దలో..

అందరి సహకారంతోనే ప్రజాసేవ

కోస్గి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ మధుకర్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. ప్రజాప్రతినిధుల పదవి కాలం ముగియడంతో చివరి సమావేశంతోపాటు విడ్కోలు సమావేశం సైతం ఏర్పాటు చేసి ప్రజా ప్రతినిధులను సన్మానించారు. ఐదేళ్ల కాలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాలన పరంగా కలిసి చేసిన ప్రయాణాన్ని మరోమారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రకాష్ రెడ్డి, ఎంపీపీ మధుకర్‌రావు, ఎంపీడీఓ సాయి లక్ష్మీ, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: ఐదేళ్ల పదవికాలంలో మేము చేసినా పనులుగానీ, ఇతర ప్రజా కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయని ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సభ్యుల పదవి కాలం పూర్తయిన సందర్భంగా ఆత్మీయ సన్మాన సమావేశం అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు.. మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలకు, కో–ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీంలకు సన్మానించారు. ఎంపీటీసీలు వారి అనుభవాలను, ఐదేళ్ల కాలంలో చేసిన పనులు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, ఎంపీఓ రామన్న, పీఆర్ డీప్యూటీ ఈఈ విలోక్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, సంజీవ్, చెన్నప్ప, సంజీవ్ పాల్గొన్నారు.

మాగనూర్: ఎంపీటీసీల పదవి ముగియడంతో బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్యామలమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శాలువాతో సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం అధికారుల సహకారం మరువలేనిదని ఎంపీపీ శ్యామలమ్మ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, ఎంపీటీసీలు ఎల్లారెడ్డి, సుదర్శన్‌గౌడ్, బంగి లక్ష్మి, శ్యామలదేవి, కో–ఆప్షన్ మెంబర్ యాకూబ్‌అలీ, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

ఊట్కూర్: మండల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ భవనంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఆత్మీయ విడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల పదవికాలంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవలందించడం అభినందనీయని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, మురుగుకాల్వలు, పక్కాభవనాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు శాలువాతో సన్మానించారు. జెడ్పీటీసీ అశోక్ కుమార్‌గౌడ్, ఎంఆర్ఓ మమత, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు ఎం. బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు హన్మంతు, రాఘవరెడ్డి, కిరణ్, పద్మ, రవిప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ వెంకటయ్య, ఏఓ గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్ద: సభ్యులందరి సహకారంతోనే ఐదేళ్లపాటు ప్రజా సేవలో పాల్గొనేందుకు అవకాశం లభించిందని ఎంపీపీ నర్సప్ప అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పదవి కాలం ముగియడంతో ఎంపీటీసీ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు.. ఎంపీపీ నర్సప్ప, జెడ్పీటీసీ లావణ్య రాములు మాట్లాడారు.. తన ఐదేళ్ల పాలనలో జరిగిన వివిధ అంశాలను సభ్యులతో పంచుకున్నారు. అనంతరం ఎంపీడీఓ, తహసీల్దార్ సమక్షంలో సభ్యులందరిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లావణ్యరాములు, విండో అధ్యక్షుడు ఈదప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల్లో అవినీతిపై రగడ..

మరికల్: మహిళ సంఘాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై మండల సమావేశంలో సభ్యులు మహిళ సమాఖ్య అధికారులను నిలదీశారు. మండలంలోని రైతు వేదిక వద్ద బుధవారం ఎంపీపీ శ్రీకళ అధ్యక్షతన చివరి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ ప్రారంభం కాగానే శాఖల వారిగా అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. మహిళ సమాఖ్యలో కొనసాగుతున్న అక్రమాలపై పస్పుల ఎంపీటీసీ జయమ్మ మహిళ సమాఖ్య సీసీపై ఆరోపణలు చేశారు. రద్దు చేసిన అభయహస్తం నిధులు ఎక్కడి పోయాయని, ఏ ఒక్క లబ్దిదారుడికి పింఛన్ కాని ఆ పథకం కింద మంజూరై ఇన్స్‌రెన్స్ నిధులు లబ్ధిదారులకు అందజేయలేదని వారిని ప్రశ్నించారు. అభయ హస్తం డబ్బులను మహిళ సమాఖ్యలో ఉన్న అధికారులు సహా చేశారని వాటిని రికవరి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే మాధవరంలో ఒక అంగన్‌వాడీ కేంద్రానికి టీచర్ లేకపోవడంతో గత 5ఏళ్ల నుంచి ఆయనే పిల్లలను చూసుకుంటుందని, అంగన్‌వాడీ టీచర్‌ను వెంటనే నియమించాలని ఎంపీటీసీ ఆంజనేయులు ఐసీడీసీ సూపర్‌వైజర్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ శ్రీకళ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సహకారంతో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, చేసిన అభివృద్ధికి తమకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవి, ఎంపీడీఓ పావని, ప్రత్యేక అధికారి నరేందర్, విండో చైర్మన్ రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అవినీతిపై సీసీని నిలదీస్తున్న ఎంపీటీసీ జయమ్మ

మొక్కలు తప్పనిసరిగా పెంచాలి

మద్దూరు: ప్రతి ఒక్కరూ తప్పని సరిగా మొక్కలు పెంచాల్సిన అవసరం ఎంతైన ఉందని ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి సూచించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 75వ వనమహోత్సవం సందర్భంగా ఎంపీటీసీ సభ్యులతో కలిసి మొక్కలను నాటారు. ఈ మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ కనీసం నాలుగు మొక్కలు నాటి పెంచాలన్నారు. కార్యాలయ ఆవరణలో దాదాపు వంద మొక్కలు నాటారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీఓ జయరాములు తెలిపారు. తహసీల్దార్ మహేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటయ్య, భార్గవి, లక్ష్మి, శ్రీనివాస్, రాము, కాంతారెడ్డి, వెంకటేష్, భార్గవి, ఎంపీఓ రామన్న తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలి



మరికల్: రైతులు సాగు చేసే ప్రతి ఎకరాకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాలని తీలేర్ సింగిల్ విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ అన్నారు. తీలేర్ సొసైటీ వద్ద బుధవారం మహాజన సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు సకాలంలో రైతుబంధు అమలు చేసేందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పంటలు సాగుచేసి నెల దాటిన పెట్టుబడి సాయం మంజూరు చేయలేదన్నారు. సకాలంలో రైతుల ఖాతాలో పెట్టుబడి నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఓ కొదండ రాములు, సీఈఓ కృష్ణకుమార్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలి

నారాయణపేట రూరల్: ఉద్యోగ విరమణ తర్వాత శేష జీవితాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు కేటాయించాలని డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘని అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్‌లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన ధర్మరాజు దంపతులను బుధవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితానికి మాత్రమే విరమణ తీసుకున్నారని, భవిష్యత్‌లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సలహాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, డీఎస్ఓ భానుప్రకాష్, రిటైర్డ్ ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, రమేష్‌శెట్టి, సంఘ నాయకులు జనార్ధన్‌రెడ్డి, శేర్‌కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ధర్మరాజును సన్మానిస్తున్న డీఈఓ, రిటైర్డ్ టీచర్లు

దివ్యాంగుల ఫించన్ పెంచాలని ధర్నా



నారాయణపేట: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో ఫించన్‌ను పెంచాలని బుధవారం స్థానిక మున్సిపల్ పార్కు వద్ద ధర్నా చేపటారు. ఈ మేరకు.. జిల్లా అధ్యక్షుడు కే కాశప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి రాధ మాట్లాడుతూ.. ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చినా ప్రకారం దివ్యాంగుల పెన్షన్ రూ. 6 వేలకు పెంచి వెంటనే అమలు చేయాలన్నారు. 2024 జనవరి నుంచే పెరిగిన పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి ఏడు నెలలు గడుస్తుందని, 2014లో అప్పటి ప్రభుత్వం ఆసరా పెన్షన్ మంజూరుకు ఆదాయ పరిమితి విధిస్తూ జీవో 17ను విడుదల చేసిందన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నారాయణమ్మ వెంకటయ్య, కతాల్ హన్మంత్ రెడ్డి, పెంటయ్య, శ్రీహరి, లక్ష్మణ్, రంగయ్య, నరేందర్, కృష్ణ, వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడుతున్న పలువురికి జరిమానాలు

కోస్గి: అధికారుల ఆదేశాలను లెక్క చేయకుండా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న పలువురు దుకాణ యజమానులకు జరిమానాలు విధించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ శశిధర్, మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు కిరాణ దుకాణాలు, ఇతర వ్యాపార దుకాణాల్లో తనిఖీలు చేశారు. నిబంధనల మేరకు 120 మైక్రాన్‌ల కన్న తక్కువ మందం ఉన్న కవర్లను వాడుతున్న యజమానులకు నోటీసులు జారీ చేయడంతోపాటు పలు దుకాణాల నుంచి రూ.11000 జరిమాన వసూలు చేశారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ అర్బాజ్, జూనియర్ అసిస్టెంట్ అవుల రఘు, శానిటేషన్ అధికారి విజయ్‌భాస్కర్‌తోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



ఓ దుకాణంలో జరిమానా రసీదు అందజేస్తున్న కమిషనర్, సిబ్బంది

ఫిర్యాదులపై స్పందించాలి

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు సందర్శించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని ఆదేశించారు. మండలంలోని అయ్యవారిపల్లి కిడ్నాప్ కేసులో విచారణ చేపట్టారు. ధన్వాడకి చెందిన చెందిన గాదెపుల్లప్ప, కావాలి శంకర్ కిడ్నాప్‌కు గురయ్యారని అన్నారు. పుల్లయ్య కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు పై స్పందించి అయ్యవారిపల్లిలో విచారణ జరుగుతోందన్నారు. లక్ష్మీకాంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిలపై కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని వివరించారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య

కృష్ణా: అత్యంత వెనుకబడిన మండలంలో ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని కడెచూర్ పీఠాధిపతి శ్రీ గురుమూర్తి శివాచార్య మహాస్వామి, నేరడగం పీఠాధిపతి పంచమ సిద్దలింగ మహాస్వాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జ్ఞాన సంఘమ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు.. బీఆర్ఎస్ యువజన నాయకులు శివరాజ్ పాటిల్ తన తండ్రి జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు విలువైన విద్యను అందించాలనే లక్ష్యంతో పాఠశాల ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అదేవిధంగా తల్లిదండ్రి కోల్పోయిన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ, ఎంపీపీ పూర్ణిమ, గ్రామ మాజీ సర్పంచ్‌లు మహాదేవ్, సోమశేఖర్‌గౌడ్, శివప్ప, తిప్పయ్య నాయకులు రాజప్పగౌడ, విజప్పగౌడ, శ్రీనివాసులు, నర్సప్ప, బాల్‌రాజ్, సోమనాథ్‌రెడ్డి, భీమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివరాజ్ పాటిల్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మరికల్‌లో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్



ఊట్కూర్‌లో..

నారాయణపేట: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్యదర్శుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చాలిచాలని వేతనాలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగిగా గుర్తించాలని, కలెక్టర్ సత్వరమే స్పందించి పెండింగ్‌లో ఉన్నా ఆరు నెలల పంచాయతీ కార్యదర్శిల వేతనాలు వెంటనే అందివ్వాలని కోరారు.

మరికల్: గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రేపు చేపట్టిన చలో కలెక్టర్‌రేట్ కార్యాలయాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బుధవారం ఆయన పంచాయతీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ.. జీఓ 60 ప్రకారం వారికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.బాలప్ప, సత్యమ్మ, లక్ష్మణ్, రాజమ్మ, వెంకటయ్య పాల్గొన్నారు.

నర్వ: గ్రామ పంచాయతీ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు రేపు చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కార్మికులనుద్దేశించి మాట్లాడారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి, మల్టిపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు గొల్ల రాంచంద్రి, కేశవులు, చింటు, శివ, నర్సింహ, కడపన్న, రాములు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి..

ఊట్కూర్: ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అందించాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు కనకరాయుడు కోరారు. బుధవారం మండలంలోని చిన్నపొర్లలో ఏఐపీకేఎంఎస్ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కనీస వేతనాలకోసం సమగ్ర చట్టం చేసి, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాసిం, నర్సింహులు, అంజప్ప, కృష్ణయ్య పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: మహిళలు, బాలికలు తప్పకుండా షీటీంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. బుధవారం మండలంలోని కోటకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ అమ్మాయిలను వేధిస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీం ఉంటాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు, విద్యాలయాల్లో బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. అదేవిధంగా మత్తుపదార్థాలు తీసుకోవడంతో కలిగే అనర్థాలను వివరించారు. జీహెచ్ఎం సునీత, పీఈటీ రమణ, షీటీం సభ్యురాలు నమీనా, సభ్యులు దేవి, రాధిక పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఫీల్డ్ ఆఫీసర్‌కు సన్మానం

మాగనూర్: మండలంలోని ఏపీజీవీబీ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రణయ్ బదిలీపై భువనగిరి బ్రాంచ్‌కు వెళ్తున్న సందర్భంగా మండల రైతులు, వివిధ పార్టీల నాయకులు ఆయనను శాలువాతో ఘనం సన్మానించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌లో ఇన్ని రోజులు సేవలు అందించినందుకు బ్యాంకు సిబ్బందికి, ఖాతాదారులకు, మండల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు



పేటలో మాట్లాడుతున్న సాయికుమార్



మక్తల్‌లో మాట్లాడుతున్న భాస్కర్

నారాయణపేట రూరల్ : నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై నిరసన వ్యక్తం చేస్తూ గురువారం నిర్వహించ తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జిల్లాలో విజయవంతం చేద్దామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని భగత్‌సింగ్ భవన్‌లో బుధవారం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.. పేపర్ లీకేజీలు, కార్పొరేట్ కళాశాలల వికృత చేష్టలతో చాలా మందికి అన్యాయం జరుగుతుందని విమర్శించారు. వెంటనే సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నీట్ పరీక్షను పునః నిర్వహించాలని, ఎన్‌టీఏను రద్దు చేసి, నీట్ చైర్మన్ ప్రదీప్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, కృష్ణ, రాజు, సురేష్, శ్రీను, పవన్ పాల్గొన్నారు.

మక్తల్: నీట్ పేపర్లు లీకేజీ చేసి 24లక్షల మంది జీవితాలతో చెలగాటమాడిన ఎన్‌టీఏ ఏజెన్సీని రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు.. పలు డిమాండ్ల మేరకు గురువారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు, జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, శివ, కర్రె, రవి కుమార్, రమేష్ పాల్గొన్నారు.

మాగనూర్: నీట్ పేపర్లు లీకేజీ చేసి 24లక్షల మంది జీవితాలతో చెలగాటమాడిన ఎన్‌టీఏ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యాసంస్థల బంద్ విజయవంతం చేద్దామని మండల ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు చిన్న నర్సింహులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. అసమర్థ ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నయ్యూం, నరసింహ, సాకేత్, ప్రభు, మహేష్, అనిల్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారిణికి డిప్యూటేషన్

ధన్వాడ: ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ కీర్తి జాయిన్ అయి ఒక నెల కూడా గడవక ముందే కోటకొండ ప్రభుత్వ ఆస్పత్రి డిప్యూటేషన్ వేయడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త డాక్టర్‌ను ఏర్పాటుచేసి నెలలు కూడా గడవక ముందే డిప్యూటేషన్‌పై ఇతర మండలాలకు పంపడంపై ఏమిటని? మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. డిప్యూటేషన్ రద్దుచేసి ధన్వాడకు కేటాయించాలని కోరుతున్నారు.